క్లుప్తంగా

పాఠశాల క్రీడలకు నేటి నుంచి ఎంపికలు

అంబాజీపేట: స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో బుధ, గురువారాల్లో జరిగే మండల స్థాయి బాలుర, బాలికల పాఠశాల క్రీడలు నిర్వహించనున్నట్లు మండల స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి అందె సూర్యనారాయణ తెలిపారు. అండర్ 14, 15 బాలుర, బాలికల విభాగాల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. అథ్లెటిక్స్‌తో పాటు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీలు జరగనున్నాయన్నారు.

లడ్డూ వేలం



గుంటమామిడితోటలో స్వామి లడ్డూ దక్కించుకున్న రమణ-జ్ఞానభార్గవి దంపతులు

అంబాజీపేట: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని అంబాజీపేట మండలంలో పలు ప్రాంతాల్లో అమ్మవారి అన్నసమారాధనలు, లడ్డూ వేలం పాటలను మంగళవారం నిర్వహించారు. స్థానిక పశువుల ఆస్పత్రి ఎదురుగా ఉన్న సత్యసాయి నగర్‌లో గణపతి ఆలయం వద్ద స్వామి వారికి గరిక పూజ నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన చేపట్టారు. గంగలకుర్రు గుంటమామిడి తోటలో లక్ష్మీ గణపతి ఆలయం వద్ద స్వామి వారి లడ్డూను అమలాపురానికి చెందిన దంగేటి రమణ, జ్ఞానభార్గవి దంపతులు రూ.18,800కు వేలంలో దక్కించుకున్నారు. బుధవారం స్వామి వార్ల నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

హనుమాన్ చాలీసా పారాయణ

పి.గన్నవరం: ఎల్.గన్నవరం అక్విడెక్ట్ సమీపాన ఉన్న దాసాంజనేయ స్వామి వారి ఆలయం వద్ద మంగళవారం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. కె.ముంజవరానికి చెందిన కుంపట్ల సాయిరామకృష్ణ వర ప్రసాదరావు, రామలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో తోటకూర లక్ష్మీనరసింహ మూర్తి, మేడిశెట్టి సత్యనారాయణ, లలిత మహిళా సమాజం, మణికంఠ భజన సమాజం సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సందర్భంగా స్వామికి భక్తులు పూజలు చేశారు.

19న ర్యాలీకి సమాయత్తం

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో ఆక్వా చెరువులపై ఎన్జీటీ తీర్పును అమలు చేయాలని మద్దతు కోరుతూ ఈ నెల 19న తీర ప్రాంత గ్రామాల మీదుగా ర్యాలీకి సదరు గ్రామ ప్రజలు సమాయత్తమవుతున్నారు. ఈ మేరకు ప్రజలందరినీ చైతన్య పరుస్తూ ఇందుకు సంబంధించిన కరపత్రాలను, ప్రకటనలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అంతర్వేది దేవస్థానంలోని 16 కాళ్ల మండపం వద్ద నుంచి కేశవదాసుపాలెం వరకూ ఈ ర్యాలీ నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఆక్వా చెరువులు నశించాలి, అంతర్వేదిని రక్షించాలన్న ప్రధాన డిమాండ్‌తో ఈ ర్యాలీకి సంసిద్ధులవుతున్నారు. అలాగే సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్న ఆక్వా చెరువులను తొలగించాలని కూడా వారు అధికారులను సదరు ప్రకటనలో కోరారు.

22 నుంచి ప్రవచన మహోత్సవాలు

అంబాజీపేట: స్థానిక పెద్దవీధిలో ఉన్న ఏవీఆర్ గ్రాండ్ ఏసీ కల్యాణ మండపంలో ఈ నెల 22 నుంచి 19వ తేదీ వరకు శ్రీమద్రామాయణ ప్రవచన మహోత్సవాలను నిర్వహించనున్నట్లు అప్పన రవికుమార్-రేవతి దంపతులు తెలిపారు. ఈ ప్రవచనాలను శ్రీనివాస రామానుజదాసుతో చేయిస్తామన్నారు. ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ప్రవచనాలు జరుగుతాయన్నారు. భక్తులంతా విచ్చేసి ప్రవచనాలను వినాలని కోరారు.

ఎన్జీటీ తీర్పు నిరసిస్తూ రైతుల ధర్నా



కరవాకలో ధర్నా చేస్తున్న ఆక్వా రైతులు

మామిడికుదురు: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ) తీర్పు నిరసిస్తూ ఆక్వా రైతులు మంగళవారం కరవాక గ్రామంలో ధర్నా చేశారు. 40 ఏళ్ల నుంచి ఆక్వా సాగు చేస్తూ 500 కుటుంబాలు జీవనం సాగిస్తున్నామని ఆక్వా చెరువులను ధ్వంసం చేయడం వల్ల తాము జీవనోపాధిని కోల్పోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తామంతా నిరుపేద కుటుంబాలకు చెందిన రైతులమని, చెరువులకు గండ్లు కొడితే మా పరిస్థితి ఏం కావాలంటూ వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తామంతా పురుగుమందు తాగి కుటుంబ సమేతంగా ఆత్మహత్యలు చేసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని, ఎన్జీటీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో గ్రామ సర్పంచ్ రేకాడి సత్యనారాయణ, ఎంపీటీసీ మల్లాడి వడ్డికాసులు, మాజీ సర్పంచ్ కొల్లు బాలకృష్ణ, మత్స్యకార సంఘం నేతలు పాల్గొన్నారు.

నులిమేద్దాం

- విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- ఘనంగా డీ వార్మింగ్ డే

అలమూరు: మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మంగళవారం నిర్వహించిన డీ వార్మింగ్ డేను పురస్కరించుకుని 96.7 శాతం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ జరిగింది. వైద్యాధికారులు చలో విజయవాడకు పిలుపు నివ్వడంతో విధులకు గైర్హాజరయ్యారు. దీంతో ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈ బి.సూర్యనారాయణ సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి నేతృత్వంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు చిన్నారులు, విద్యార్థులు, యువకులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. చొప్పెల్ల పీహెచ్‌సీ పరిధిలో 6629 గాను 6345 మందికి, పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో 5140 మందికి గాను 5038 మందికి ఈ మాత్రలను వినియోగించుకున్నారు.

కొత్తపేట: విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతారని ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి అన్నారు. మండలంలోని అవిడి, వానపల్లి పీహెచ్‌సీల ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులతో



కొత్తపేటలో నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న ఎంపీపీ మార్గన, జెడ్పీటీసీ రమాదేవి

మాత్రలు మింగించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, పంచాయతీ సభ్యుడు విళ్ల మారుతీప్రసాద్, ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, హెచ్ఎంలు ఆర్ రామకృష్ణ, సత్యనారాయణ, పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలలో నులిపురుగు నివారణ, మాత్రలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

మామిడికుదురు: నులిపురుగుల నివారణకు విద్యార్థులతో విధిగా ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు సూచించారు. ఈ సందర్భంగా నగరం గ్రామంలో చిన్నారులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. నగరం జెడ్పీహెచ్ స్కూల్‌లో సర్పంచ్ జాలెం రమణకుమారి మాత్రలు విద్యార్థులకు మింగించారు.



చొప్పెల్లలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది



పెదపట్నంలంకలో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

లూటుకుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ కాశిరెడ్డి అంజిబాబు, సర్పంచ్ అడబాల తాతకాపు, ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు విద్యార్థులకు మాత్రలు మింగించారు. పెదపట్నంలంకలో సర్పంచ్ సుందరనీడి చిన్ని, పంచాయతీ కార్యదర్శి మైథిలి విద్యార్థులకు మాత్రలు అందించారు. మండలంలోని 18 గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులకు పీహెచ్‌పీ ఉద్యోగులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు, మాత్రలు మింగించారు.

అంబాజీపేట: రక్తహీనతతో అధిక శాతం అనారోగ్యాలకు కారణమవుతున్న నులిపురుగును ఆల్బెండజోల్ మాత్రల ద్వారా తరిమికొడదామని హెచ్ఎం కడలి సాయిరామ్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీల ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను మండలంలోని అన్ని పాఠశాలలకు మంగళవారం పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థికి భోజనమైన తరువాత ఆల్బెండజోల్ మాత్రలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయినవిల్లి: వీరవల్లిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బుచ్చిరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, ఆరోగ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విషయ పరిజ్ఞానం ఉండాలి

అంబాజీపేట: పాఠశాల సముదాయ సమావేశాలను సద్వినియోగం చేసుకుని విషయ పరిజ్ఞానంపై ఉపాధ్యాయులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ మధుసూదనరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను మంగళవారం నిర్వహించారు. మధుసూదనరావు మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ప్రాథమిక పాఠశాల స్థాయిలో 2024-25కి ఉపాధ్యాయులకు పాఠశాల సముదాయ సమావేశాలను నిర్వహించాలని రాష్ట్ర సమగ్ర శిక్షా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ కాంప్లెక్స్ సమావేశంలో నేర్చుకున్న విషయ పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పాఠశాలల్లో సంపూర్ణంగా అవలంబించేలా కృషి చేయాలన్నారు. అనంతరం తరళ్,



అంబాజీపేటలో భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అడిషనల్ కో ఆర్డినేటర్ మధుసూదనరావు

విద్యా ప్రవేశ్, షిప్ట్ చాట్, టీచ్ టూల్‌లపై అవగాహన కల్పించారు. అనంతరం పీఎంశ్రీలో భాగంగా నిర్మిస్తున్న సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. సమావేశంలో సీఎంఓ బీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ1,2లు కాంద్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని పుట్టినరోజు

పి.గన్నవరం: ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజును మండల బీజేపీ అధ్యక్షుడు యర్రంశెట్టి సాయిబాబు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మూడురోడ్ల సెంటర్లో ఘనంగా నిర్వహించారు. మోదీ బర్త్ డే కేకును ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు చెరుకూరి గోపాలకృష్ణ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. కార్యక్రమంలో నాయకులు వాసంశెట్టి కుమార్, మద్దా చంటిబాబు, చీకరమెల్లి శ్రీను, సాధనాల జేడీ, తాటికాయల శ్రీనివాస్, కర్రి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మొగలికుదురు ఆశ్రమంలో పండ్ల పంపిణీ

మామిడికుదురు: ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజును పురస్కరించుకుని మొగలికుదురు సత్యసాయి భరోసా దీన జనోద్ధరణ కేంద్రంలో వృద్ధులు, అనాథలకు మంగళవారం పండ్లు, బ్రెడ్లు, పాలు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు మెండా ఆదినారాయణ ఆధ్వర్యంలో నియోజకవర్గ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు వీటిని పంపిణీ చేశారు. ఈ రోజు నుంచి అక్టోబరు 2 గాంధీ జయంతి వరకు బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: ప్రధాని మోదీ జన్మదినాన్ని మండలంలోని కేశనపల్లిలో ఎన్డీఏ నాయకుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. అమ్మ పేరుతో చెట్టు కార్యక్రమంలో భాగంగా హైస్కూల్లో మాజీ శాసన



మొగలికుదురులో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

సభ్యుడు రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా, స్థానిక సర్పంచ్ యెనుముల నాగు, హైస్కూల్ చైర్మన్ అడబాల ఏసుబాబు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాపాక సత్యనారాయణ, హెచ్ఎం ఎస్.ఉమామహేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజును గ్రామంలో మంగళవారం బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పార్టీ శ్రేణులు మిఠాయిలు పంచారు. అనంతరం ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, కిసాన్ మోర్చా రాష్ట్ర డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామ కృష్ణంరాజు మాట్లాడుతూ, ప్రధాని మోదీ సంక్షేమంతో పాటు అభివృద్ధిని భారత దేశానికి అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భోజనశాలకు దాతల సహకారం

అంబాజీపేట: విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు దాతల సహకారంతో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనశాలను నిర్మిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం కె.సాయిరామ్ తెలిపారు. అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ముత్యాల సాయిరామ్ సోదరులు భోజనశాల నిర్మాణానికి రూ.1.50 లక్షల నగదును పాఠశాల హెచ్ఎంకు మంగళవారం అందజేశారు. సాయిరామ్ మాట్లాడుతూ రెండు వేల అడుగుల విస్తీర్ణం కలిగిన స్థలంలో భోజనశాల నిర్మించేందుకు సుమారు రూ.6 లక్షలు ఖర్చవుతుందన్నారు. ఇప్పటివరకు పూర్వ విద్యార్థులు, దాతలు రూ.4 లక్షలు అందించారన్నారు. వడ్లమాని గోపాలకృష్ణ రూ.లక్ష, వడ్లమాని లక్ష్మీప్రసాద్ రూ.50 వేలు, పాఠశాల అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్లు కామిశెట్టి మధుబాబు, అరిగెల రామతులసి రూ.లక్ష రూపాయలు అందించారన్నారు. కార్యక్రమంలో కృషీవల కోకోనట్ ఫార్మర్స్, ప్రొడ్యూసర్స్ కంపెనీ చైర్మన్ గణపతి వీర రాఘవులు, సొసైటీ సీఈవో కుంపట్ల అయ్యప్ప నాయుడు, పీఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, నాయకులు రవణం రాము, ముత్యాల బాబు పాల్గొన్నారు

కళాశాలలో అక్రమాలపై విచారణ చేయిస్తాం

మలికిపురం: స్థాని ఎంవీఎన్ జేఎస్ అండ్ ఆర్వీఆర్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో చోటు చేరుకున్న అక్రమాల వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ చేయిస్తానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. కళాశాలలో వ్యవహారంపై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, గత కొన్ని నెలలుగా నిలిచిపోయిన జీతాలు ఇవ్వాలని కోరుతూ ఏడు రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న అధ్యాపకుల దీక్షా శిబిరాన్ని మంగళవారం ఎమ్మెల్యే సందర్శించి వారితో మాట్లాడారు. సుమారు రూ.40 లక్షల మేర జీతాలు బకాయిలు ఉన్నాయని అధ్యాపకులు తెలిపారు. కళాశాల పాలకవర్గం పూర్తి స్థాయిలో లేదని, బైలాకు విరుద్ధంగా కళాశాల నడుస్తుందని అధ్యాపకులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కరస్పాండెంట్ మంగెన సత్యనారాయణమూర్తి తన ఇష్టానుసారం కళాశాలను, బై లాకు విరుద్ధంగా పాలకవర్గాన్ని మార్చేశారని అధ్యాపకులు పేర్కొన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి మాట్లాడారు. కళాశాలలో చోటు చేసుకున్న ప్రతి అంశం తన వద్ద ఉందన్నారు. ఇప్పటికే తాను నన్నయ యూనివర్సిటీ



రిలే దీక్షలో కూర్చొన్న అధ్యాపకులతో మాట్లాడుతున్న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

వైస్ చాన్సలర్, రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ అధికారులతో మాట్లాడానని చెప్పారు. సమగ్ర విచారణ చేసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కరస్పాండెంట్‌తో మాట్లాడానని, ఆయన వ్యవహారం సరిగా లేదన్నారు. అధ్యాపకుల జీతాలతో పాటు కళాశాల ఆస్తుల పరిరక్షణ, విద్యార్థుల భవిష్యత్తు కూడా తమకు ముఖ్యమన్నారు. సమన్వయ కర్త గుండుబోగుల పెదకాపు, వ్యాపారవేత్త లింగోలు పెద్దబ్బులు, గెద్దం మహాలక్ష్మి ప్రసాద్, ముప్పర్తి నాని, అధ్యాపకులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

రావులపాలెం: మన చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఆర్టీసీ డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) స్థానిక డిపోలో మంగళవారం స్వచ్ఛతాహి సేవ పక్షోత్సవాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని బస్ కాంప్లెక్స్ ఆవరణలో డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ ప్రారంభించారు. రావులపాలెం డిపో సిబ్బంది అందరికీ ఈ పక్షోత్సవాల ఉద్దేశాన్ని ఆయన వివరించారు. అందరితో పరిసరాల శుభ్రత మన అందరి బాధ్యత అని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎం.అచ్యుతాంబ, కార్యాలయం సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

శిక్షణతో తరగతి బోధన మరింత మెరుగు



గొంది పాఠశాలలో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో-1 కిషోర్ కుమార్

సఖినేటిపల్లి: పాఠశాల సముదాయ శిక్షణతో తరగతి బోధన మరింత మెరుగు పడుతుందని ఎంఈవో-1 డి.కిషోర్ కుమార్, ఎంఈవో-2 మద్దాలి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం గొంది, అంతర్వేదిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ప్రైమరీ స్థాయి మండల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసింది. అలాగే హైస్కూల్ లెవెల్ సఖినేటిపల్లి, మలికిపురం మండలాల శిక్షణ తరగతులు తెలుగు సబ్జెక్టు సఖినేటిపల్లి గీతామందిరం ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. వారిరువురు మాట్లాడుతూ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయులకు ప్రతి నెలా రెండు రోజుల పాటు పాఠశాల సమావేశాలు నిర్వహిస్తామన్నారు. శిక్షణకారులు శ్రీనివాస్, బాలకృష్ణ, సత్తిపండు, రమేష్, హెచ్ఎంలు ఎస్.సత్యనారాయణ, కె.వీరాస్వామి, జె.కనక లింగేశ్వరరావు, సుగుణ పాల్గొన్నారు.

ఓజోన్ డే...

మలికిపురం: విశ్వేశ్వరాయపురం ఉన్నత పాఠశాలలో ఓజోన్ డే నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధ్యాయులు పీవీవీ వరప్రసాద్ మాట్లాడుతూ ఓజోన్ పొరను నాశనం చేసే ఫ్లోరో క్లోరోకార్బన్‌లను విడుదల చేసే రిఫ్రిజిరేటర్లు, ఏసీల వినియోగాన్ని తగ్గించాలని తెలిపారు. కార్యక్రమంలో డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా శాంతి కల్యాణం



కొత్తపేట కళానగర్ ఆలయం వద్ద స్వామిశాంతి కల్యాణం నిర్వహిస్తున్న కృష్ణంరాజు దంపతులు

కొత్తపేట: స్థానిక కళానగర్‌లో వేంచేసిన సిద్ధివినాయకస్వామి వారి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఏటా గణపతి నవరాత్రుల అనంతరం పదో రోజున స్వామి వారి శాంతి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఆ ప్రకారం సోమవారం రాత్రి ఆలయ, ఉత్సవ కమిటీ కన్వీనర్ గాలిదేవర పుల్లయ్యనాయుడు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు పుల్లాపంతుల విజయ్‌కుమార్‌శర్మ పర్యవేక్షణలో కోనసీమలో వివిధ ప్రాంతాలకు చెందిన వేదపండితుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త మంతెన వెంకట కృష్ణంరాజు దంపతులతో స్వామివారి కల్యాణాన్ని కనులపండువగా జరిపించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. కమిటీ, కళ్యాణ దాతలు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం లడ్డూను వేలంలో వ్యాపారవేత్త నంబూరి రెడ్డియ్య రూ.28,400 పాడుకున్నారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు అభినందించి, లడ్డూను అందజేశారు.

పౌరుల్లో స్ఫూర్తి నింపడమే ధ్యేయం

- ఘనంగా స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు

సఖినేటిపల్లి: మండలం అంతటా పరిశుభ్రతను కాపాడే క్రమంలో పౌర భాగస్వామ్యంతో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం విజయవంతం చేయాల్సిన ఆవశ్యకత ఉందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం సఖినేటిపల్లిలో స్వచ్ఛభారత్ మిషన్ పదో వార్షికోత్సవం, స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం ఏడు వసంతాలు పూర్తి చేసుకున్న తరుణంలో అధికారులు ఏర్పాటు చేసిన స్వచ్ఛతాహి సేవా ర్యాలీలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పరిశుభ్రతలో సమష్టి కార్యాచరణ, పౌరుల్లో భాగస్వామ్య స్ఫూర్తిని నింపడమే ధ్యేయంగా ముందడుగు వేస్తున్నామన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ వద్ద జరిగిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఆరోగ్య, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామస్తులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పి.గన్నవరంలో జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి మెయిన్ రోడ్డు వరకూ సర్పంచ్ బొండాడ నాగమణి ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, పాఠశాల హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్, ఎంపీటీసీ పులపర్తి చిన వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: పరిశుభ్రతను పెంపొందించడానికి స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఎంపీడీఓ నాతి బుజ్జి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గ్రామాల్లో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని 17 గ్రామాల్లో స్వచ్ఛత ప్రతిజ్ఞలు,



వాడపాలెం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ర్యాలీలు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 17 నుంచి వచ్చే నెల 2 వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎంపీడీఓ నాతిబుజ్జి తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: మండలాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడం ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి పేర్కొన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి ఈఓపీఆర్డీ బి.మమత అధ్యక్షతన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల సెంటర్ వరకు స్వచ్ఛతాహి సేవా ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, అధికారులు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా మలికిపురం గ్రామ పంచాయతీ వద్ద ఎమ్మెల్యే మొక్క నాటి ర్యాలీ నిర్వహించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పాల్గొని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, సర్పంచ్ గెద్దం రాజ్యలక్ష్మి తదితరులు



అంబాజీపేట ర్యాలీలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ వరలక్ష్మి

పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: స్వచ్ఛభారత్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్‌లు అడబాల తాతకాపు, అల్లు విజయలక్ష్మి, జాలెం రమణకుమారి, సుందరనీడి చిన్ని కోరారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా మంగళవారం లూటుకుర్రు, గోగన్నమఠం, నగరం, పెదపట్నంలంక తదితర గ్రామాల్లో మొక్కలు నాటారు. విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాల్లో పలు శాఖల ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: పరిశుభ్రత, పచ్చదనంతో నిండిన స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దడమే స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం లక్ష్యమని, అందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. వాడపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం జరిగిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు పాల్గొన్నారు. ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా సత్యానందరావు మొక్క నాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అనంతరం సత్యానందరావు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేశ్వరరావు, ఎంఈఓ హరిచంద్రప్రసాద్, సర్పంచ్ త్సామా బాబు తదితరులు పాల్గొన్నారు.